
సాక్షి
వికారాబాద్
సోమవారం । 20 । జనవరి । 2025





## క్రీడలతో స్నేహపూర్వక..

పోలీసులు, జర్నలిస్టుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ నిర్వహించడం అభినందనీయమని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. 8లో▸



## రోడ్లకు మహర్దశ

దౌల్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు తమ పొలాలకు సులభంగా వెళ్లేందుకు మార్గం సుగమం కానుంది. 8లో▸



## తండాల్లో మూత'బడి'!

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్చాలని అధికారులు చేస్తున్న విన్నపాలు ఫలించడం లేదు. 9లో▸

## న్యూస్‌రీల్

### నేటి ప్రజావాణి రద్దు

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై క్షేత్రస్థాయి పరిశీలన ఉన్నందున సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సోమవారం కలెక్టరేట్‌కు రాకూడదని ఆయన కోరారు.

### హక్కుల కోసం నిరంతరం పోరాడుతాం

**ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ సుభాష్**



ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గ సభ్యులతో సుభాష్

దోమ: మాదిగల హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ సుభాష్ అన్నారు. ఆదివారం దోమ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షుడిగా దిర్సంపల్లికి చెందిన బందయ్య, ఉపాధ్యక్షుడిగా బొంపల్లికి చెందిన డి.వెంకటేశ్, కార్యదర్శిగా రాపోల్ వెంకట్, వర్కింగ్ ప్రసిడెంట్‌గా దోమ గ్రామానికి చెందిన ఇక్కి రాములు, అధికార ప్రతినిధిగా వెంకటేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాదిగ హక్కుల కోసం వచ్చే నెల 7న హైదరాబాద్‌లో లక్ష డప్పులు.. వేల గొంతులు అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు రాఘవాపురం రాములు, తెలంగాణ ఉద్యమకారుడు రామన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.

### సర్వే పకడ్బందీగా నిర్వహించండి

**అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్**



రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న మహిళ నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

కొడంగల్ రూరల్: రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డుల కోసం చేపట్టిన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన సర్వే ప్రక్రియను పరిశీలించారు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. సాగుకు యోగ్యమైన భూములకు రైతుభరోసా సాయం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### ముదిరాజ్‌లను బీసీ ఏలోకి మార్చాలి

**ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు శివకుమార్**



పండుగల సాయన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంఘం నేతలు

పరిగి: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి చేర్చాలని ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు శివకుమార్ ముదిరాజ్ అన్నారు. ముదిరాజ్ ప్రజా చైతన్య యాత్ర ఆదివారం పరిగి పట్టణానికి చేరుకుంది. ప్రధాన కూడలిలోని పండుగల సాయన్న విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న తాము అన్ని రకాలుగా అణచివేతకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల సాధన కోసం ఈ యాత్ర చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ పిట్ల నర్సింహులు ముదిరాజ్, నియోజకవర్గ అధ్యక్షుడు రామస్వామి, నాయకులు భాను, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయిలో వరి సాగు

- చెరువులు, కుంటల్లో పుష్కలంగా నీరు ఉండటమే కారణం
- జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 93 వేల ఎకరాలు
- ఇప్పటి వరకు 1,96,898 ఎకరాల్లో నాట్లు
- మరింత పెరిగే అవకాశం
- శాస్త్రీయ పద్ధతులు పాటించాలంటున్న వ్యవసాయ శాఖ అధికారులు



దోమ మండలంలో వరి నాట్లు వేస్తున్న రైతులు

వికారాబాద్: ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరిసాగు గణనీయంగా పెరిగింది. అంచనాలకు మించి రికార్డు స్థాయిలో నాట్లు వేశారు. ఇప్పటికే సాధారణ సాగు విస్తీర్ణం(93 వేల ఎకరాలు) దాటి 1,96,898 ఎకరాలకు చేరుకుంది. నెల పదిహేను రోజులుగా నాట్లు వేసుకోవడంలో రైతన్న బిజీ కాగా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. సానుకూల వర్షపాతమే ఇందుకు కారణమని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది సాధారణ వర్షపాతాన్ని మించి నమోదు కావడంతో పాటు వానా కాలం చివర (అక్టోబర్, నవంబర్) వరకు వర్షాలు కురిశాయి. దీంతో చెరువుల్లోకి నీరు పుష్కలంగా చేరింది. భూగర్భజలాలు కూడా పెరగడంతో బోరు బావుల్లోనూ నీరు పెరిగి వరి సాగుకు దోహదం చేసింది. ఈ నెల మూడో వారం వరకు నాట్లు కొనసాగే అవకాశం ఉంది. జిల్లాలో అత్యధికంగా పరిగి, కొడంగల్ నియోజకవర్గాలతో పాటు వికారాబాద్ నియోజకవర్గం పరిధిలోని ధారూరు, కోట్‌పల్లి, తాండూరు పరిధిలోని యాలాల్, తాండూరు, బషీరాబాద్ మండాలాల్లో అత్యధికంగా సాగు చేశారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 93 వేల ఎకరాలు కాగా ఈ సారి ఆల్‌టైమ్ రికార్డు నమోదైంది. ఉద్యానవన, ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులను ప్రోత్సహించకపోవడం కూడా వరి సాగు గణనీయంగా పెరగటానికి కారణమని వ్యవసాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### సానుకూల వర్షపాతం

వరి సాగుకు అధిక వర్షాలు కారణమని చెప్పవచ్చు. జిల్లాలో ఈ ఏడాది సాధారణ వర్షపాతాన్ని మించి వర్షం పడటంతో చెరువులు నిండుకుండల్లా మారాయి. ప్రధాన ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి. జుంటుపల్లి, కోట్‌పల్లి, లఖ్నాపూర్, సర్పన్‌పల్లి, శివసాగర్ ప్రాజెక్టులు అలుగు పారాయి.

### 418 ఎకరాల్లో ఇతర పంటలు

యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1,97,316 ఎకరాల్లో పంటలు సాగు చేస్తుండగా ఇందులో 1,96,898 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కేవలం 418 ఎకరాల్లో మాత్రమే ఇతర పంటలు వేశారు. జిల్లాలో 20 మండలాలు ఉండగా 12 మండలాల్లో వెయ్యి నుంచి ఏడు వేల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. మరింత పెరిగే అవకాశం ఉంది. ఉద్యానవన పంటలు, ఆయిల్ పామ్, ఆలు, పూలు, కూరగాయల సాగు పెంచాలని అధికారులు సూచిస్తున్నా రైతులు అటువైపు ఆసక్తి చూపడం లేదు. ఆ తరహా పంటల సాగుపై అవగాహన లేక వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తమ సూచనలు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

### విత్తనాల కొరత లేదు



చాలా మంది రైతులు అధిక మోతాదులో ఎరువులు వాడుతున్నారు.. మోతాదుకు మించి వాడితే లాభాల కంటే అనర్థాలే ఎక్కువ.. యూరియా ఎక్కువగా వాడితే పైరు ఎక్కువగా పెరిగి పచ్చగా మారటంతో చీడపీడల శాతం పెరిగి దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది. ప్రస్తుత సీజన్‌కు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం.

– మోహన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

# అర్హులందరికీ రేషన్ కార్డులు



అనంతగిరి: ధన్నారంలో అర్హుల వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు

**కార్డుల జారీ నిరంతర ప్రక్రియ**
**కలెక్టర్ ప్రతీక్ జైన్**

అనంతగిరి: అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని, కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సభలు, వార్డు కార్యాలయాలు, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులు జారీ చేస్తామని తెలిపారు. కుటుంబంలో విభజన అయిన వారు కొత్త కార్డు కోసం చేసుకున్న దరఖాస్తును కూడా పరిశీలిస్తామన్నారు. పెండింగ్ వాటిని కూడా పరిశీలిస్తామన్నారు. గతంలో అర్జీలు ఇవ్వని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటి కోసం దరఖాస్తు చేసుకొని ప్రజాపాలన ఆన్‌లైన్‌లో పేర్లు రాని వారు మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

### ఆకస్మిక తనిఖీ

ప్రభుత్వ పథకాల అమలుకు చేపట్టిన సర్వే ప్రక్రియను ఆదివారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వికారాబాద్ మండలం ధన్నారం, పూడూరులో పర్యటించారు. రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సర్వే వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. త్వరితగతిన ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభ్యలు నిర్వహించి ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో అర్హుల జాబితాను చదవి వినిపించాలన్నారు. గ్రామ సభ ఆమోదం మేరకు లబ్ధిదారుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. 26న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు సంక్షేమ ఫలాలు అందాలి

పూడూరు: ప్రజాపాలన దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించి అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ప్రజాపాలన దరఖాస్తు పరిశీలనలో భాగంగా పూడూరులో ఇంటింటికి తిరిగి రేషన్‌కార్డుల సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భరత్‌గౌడ్, ఎంపీడీఓ పాండు, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసాకు రూ.7 వేల కోట్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

- సాగుకు యోగ్యమైన భూములకే పథకం
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా పథకం అమలవుతుందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగి పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి అన్ని పథకాలు అమలవుతాయని తెలిపారు. జిల్లాలో సాగు భూమి 5,84,000 ఎకరాలు ఉందని ఒక్కో ఎకరాకు రూ.12వేలు చొప్పున మొత్తం రూ.7వేల కోట్లు అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ పథకం వర్తిస్తుందని తెలిపారు. రేషన్ కార్డుల కోసం గ్రామాల్లో పరిశీలన కొనసాగుతోందని చెప్పారు. నియోజకవర్గానికి కొత్తగా 7,779 రేషన్ కార్డులు వచ్చే అవకాశం ఉందన్నారు. 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందని తెలిపారు. అర్హులకు ఇళ్లు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, ఆయ మండలాల పార్టీ అధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, సురేందర్, నాయకులు బంగ్ల యాదయ్యగౌడ్, జగన్, రామకృష్ణారెడ్డి, రాజపుల్లారెడ్డి, చిన్న నర్సింహులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన ఓరియంటేషన్ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న డీబీ శీతల్

అనంతగిరి: వికారాబాద్ కోర్టు ఆవరణలో రెండు రోజులుగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పారాలీగల్ వలంటీర్లు, న్యాయ విద్యార్థులకు, న్యాయసేవా ప్యానల్ న్యాయవాదులకు నిర్వహిస్తున్న ఓరియంటేషన్ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలు, సీనియర్ సిటిజన్ యాక్టు, ప్రిలిటిగేషన్ కేసులు, కళాశాలల్లో జరుగుతున్న ర్యాగింగ్, జువెలిన్ యాక్టు, పిల్లల సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఒకవేళ చిన్న పిల్లలు నేరాలు చేసినట్లయితే వారికి ఎలాంటి శిక్షలు ఉంటాయనే అంశంపై శిక్షణ కల్పించారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి శృతిదూత, చీఫ్ లీగలేర్ న్యాయవాది వెంకటేష్, డిప్యూటి లీగలేర్ న్యాయవాది రాము, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్, న్యాయవాదులు శంకరయ్య, నరేందర్ యాదవ్, శ్రీశైలం, యాదగిరి, సుధాకర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు

మహేశ్వరం: ముదిరాజులు రాజకీయంగా బలపడినప్పుడే ఆర్థికంగా ఎదుగుదల ఉంటుందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చందన చెరువు కట్టపై ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహాన్ని చేవెళ్ల లోక్‌సభ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నీలం మధు ముదిరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ వీరుడు పండుగ సాయన్న నిత్యం పేద ప్రజల కోసం ఆలోచించేవాడని, రజాకార్ల అన్యాయాలను ఎదిరించి ప్రతి ఒక్కరికీ అండగా ఉన్నారన్నారు. పేద ప్రజల కడుపు నింపిన మహనీయుడు అని కొనియాడారు. పండుగ సాయన్న చూపిన మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో మీర్‌పేట మేయర్ దుర్గాదీప్‌లాల్, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత రెడ్డి, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మీర్‌పేట ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, యాదగిరి ముదిరాజ్, తుమ్మల రమేష్, చింతల రాఘవేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్ లేకుండానే టెస్టులు!

- ఇలా వెళ్లి.. అలా వస్తే డ్రైవింగ్ టెస్ట్ పాస్
- ఆర్టీఓ కార్యాలయానికి సొంత భవనం కరువు
- ఏడేళ్లుగా ఇదే పరిస్థితి
- స్థలం కూడా కేటాయించలేని దుస్థితి
- జిల్లాలో వాహనాల సంఖ్య 1.2లక్షలు
- ఏటా పన్నుల రూపంలో వచ్చే ఆదాయం రూ.50 కోట్లు




వికారాబాద్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న డీటీఓ కార్యాలయం

వికారాబాద్: ఇక్కడ అంతా ఈజీ.. డ్రైవింగ్ టెస్ట్ అంతకంటే సులువు.. ఇలా వెళ్లి.. అలా వస్తే చాలు.. డ్రైవింగ్ టెస్ట్ పాస్.. ఇదీ వికారాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో సేవల పరిస్థితి.. ఆదాయం బాగున్నా సొంత భవనానికి నోచుకోవడం లేదు. జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లా కేంద్రం వికారాబాద్‌లో డీటీఓ(డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్) కార్యాలయం ఏర్పాటు చేశారు. ఏడేళ్ల గడిచినా సొంత భవనం మాట అటుంచితే స్థలం కూడా కేటాయించలేదు. దీంతో అరకొర సౌకర్యాలతో శివరెడ్డిపేట్‌లోని అద్దె భవనంలో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. ఓపెన్ ప్లేస్‌లోనే టెస్ట్ డ్రైవింగ్ నిర్వహిస్తున్నారు. జిల్లాల పునర్విభజనకు ముందు పరిగిలో మాత్రమే ఆర్టీఏ యూనిట్ కార్యాలయం ఉండేది. ప్రస్తుతం వికారాబాద్‌లో ఆర్టీఏ కార్యాలయం, పరిగిలో యూనిట్ కార్యాలయం, తాండూరులో ఎంవీఐ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. పరిగిలో సొంత భవనం ఉండగా వికారాబాద్, తాండూరులో అద్దె భవనాల్లో కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. వికారాబాద్ – అనంతగిరి మార్గంలో ప్రభుత్వం స్థలం ఉండటంతో అక్కడ స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్టు డీటీఓ తెలిపారు. దాదాపు అక్కడే ఖరారయ్యే అవకాశం ఉంది.

### పరిగిలో మాత్రమే టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్

జిల్లాలో మొత్తం మూడు చోట్ల ఆర్టీఏ కార్యాలయాలు ఉండగా ఒక్క పరిగిలో మాత్రమే టెస్ట్ డ్రైవింగ్ ట్రాక్ ఉంది. వికారాబాద్, తాండూరులో ఓపెన్ ప్లేస్‌లలో డ్రైవింగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వికారాబాద్‌లో ఆర్టీఓ కార్యాలయం, టెస్టు డ్రైవింగ్ ట్రాక్ ఏర్పాటుకు 13 ఎకరాల స్థలం అవసరమని ఆ శాఖ అధికారులు అంటున్నారు. గతంలో స్థలాలు చూసినా కావాల్సినంత లేక వదిలేశారు. వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్రెపల్లి శివారులో 160 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్న అధికారులు ఆర్టీఏ కార్యాలయానికి 13 ఎకరాల భూమి కేటాయించ లేకపోయారు.

### పలుమార్లు నివేదించాం



జిల్లా కేంద్రం వికారాబాద్‌లో డీటీఓ కార్యాలయం, టెస్టు డ్రైవింగ్ ట్రాక్ ఏర్పాటుకు 13 ఎకరాల భూమి అవసరం. అది కూడా జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల లోపు ఉంటే మంచిది. వికారాబాద్ – అనంతగిరి మార్గంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌ను కోరాం. సానుకూలంగా స్పందించారు. దాదాపు అక్కడే స్థలం కేటాయించే అవకాశం ఉంది.

– వెంకట్‌రెడ్డి, డీటీఓ

### ఆదాయం ఘనం..

జిల్లాలో వివిధ రకాల వాహనాలు 1.2 లక్షల వరకు ఉన్నాయి. ఇందులో ఆటోలు 38,903, ద్విచక్రవాహనాలు 38,482 ఉన్నాయి. వీటి ద్వారా ఏటా సగటున రూ.40 కోట్ల నుంచి రూ. 50 కోట్ల వరకు ఆదా యం సమకూరుతోంది. పెట్టుకున్న టార్గెట్‌లో ఏడాదికి 600 నుంచి 700 రెట్ల ఆదాయం అధికంగా వస్తోంది. కానీ సౌకర్యాలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

### అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కమల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో జంతుశాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్టులను బోధించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండాలని.. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులైతే కనీసం 50 శాతం ఉత్తీర్ణత కలిగి ఉండాలని చెప్పారు. నెట్, సెట్, పీహెచ్‌డీల్లో ఏదైనా అర్హత సాధించాలన్నారు.

## క్లుప్తంగా

### సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్



నాగసమందర్‌లో సర్వేపై తహసీల్దార్‌కు సూచనలిస్తున్న శ్రీధర్

**ధారూరు:** మండలంలోని నాగసమందర్ గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను అదనపు కలెక్టర్ శ్రీధర్ ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులును గుర్తించాలని తహసీల్దార్ సాజిదాబేగంకు సూచించారు. అర్హులకు న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

### పేదలకు వరం సీఎం సహాయనిధి



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

**దోమ:** సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని శివారెడ్డిపల్లికి చెందిన వడ్డే పద్మమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకంటుంది. విషయం తెలుసుకున్న శ్రీకాంత్‌రెడ్డి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సీఎం సహాయనిధి కింద వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ చెన్నయ్య, స్కూల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సాహెబ్‌ఖాన్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

### కల్తీ ఆహార పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు

**అనంతగిరి:** ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే కల్తీ ఆహార పదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నారాయణరెడ్డి హెచ్చరించారు. ఆదివారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు బేకరీలపై దాడులు నిర్వహించారని తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ అంజనేయులు, ఎస్‌ఐ ప్రశాంత్ వర్ధన్ సిబ్బందితో కలిసి వికారాబాద్‌లో బేకరీల్లో తనిఖీలు చేసి గడువు ముగిసిన, అపరిశుభ్రంగా ఉన్న, సింథటిక్ ఫుడ్ కలర్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసులు నమోదు చేసి దుకాణదారులను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

### బసిరెడ్డిపల్లి వాసికి డాక్టరేట్



**పరిగి:** మండలంలోని బసిరెడ్డిపల్లికి చెందిన మద్దులపల్లి పద్మ ఉస్మానియ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. సంస్కృతం విభాగంలో ప్రొఫెసర్ విద్యానంద్ ఆధ్వర్యంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. అన్ని భాషలకు సంస్కృతం మూలం అని డాక్టర్ పద్మా అన్నారు.

### పౌల్ట్రీ ఫాం యజమానిపై కేసు నమోదు

**ఆమనగల్లు:** కడ్తాల్ మండల సమీపంలోని పౌల్ట్రీఫాంలో బాలుడిని పనిలో పెట్టుకున్నందుకు ఫాం యజమాని సుధీర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. పౌల్ట్రీఫాం యజమాని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 16 సంవత్సరాల బాలుడిని పనిలో పెట్టుకున్నాడని చెప్పారు. కడ్తాల్ పోలీసులు, షాద్‌నగర్ షీటీం పోలీసులు తనిఖీలు నిర్వహించి బాలుడిని పనిలో పెట్టుకున్నట్లు గుర్తించినట్లు వివరించారు. ఈ మేరకు యజమాని సుధీర్‌రెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.



# కాసుల పంట.. క్యారెట్

**వరికి ప్రత్యామ్నాయంగా సాగు**

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- నల్ల రేగడి నేలలు అనుకూలం
- 100 నుంచి 120 రోజుల్లో పంట చేతికి
- వ్యవసాయ అధికారి వెంకటేశం వెల్లడి



తిర్మలాపూర్‌లో క్యారెట్ పంటను కోస్తున్న రైతులు



**షాబాద్:** క్యారెట్ సాగు కర్షకులకు కాసుల పంట పండిస్తోంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి రావడంతో పాటు.. అదేస్థాయిలో లాభం పొందవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో నల్ల, ఎర్ర, మసక నేలలు విస్తారంగా ఉన్నాయని, ప్రస్తుతం ఈ నేలల్లో బోర్లు, బావుల కింద వరి పంటలు సాగవుతున్నాయని వెల్లడిస్తున్నారు. వరికి ప్రత్యామ్నాయంగా, క్యారెట్ వేస్తే మంచి లాభాలు ఉంటాయని మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశం రైతులకు సూచించారు. సాగు ఎలా చేయాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అవి ఇలా ఉన్నాయి.

**పొలం తయారీ**

పొలాన్ని దుక్కిదున్ని, సిఫార్సు చేసిన మేరకు ఎరువులను వాడి.. పొలం మెత్తగా ఉండేలా చూసుకోవాలి. చిన్న మడులుగా చేసుకుని, 25 సెంటీమీటర్ల దూరంలో బోదెలు వేసుకొని సాగుకు పొలాన్ని సిద్ధం చేసుకోవాలి.

**విత్తన రకాలు**

కరోడ, పూసా కేసర్, పూసా మయదగ్ని, నాంటెస్ ఇండియా గోల్డ్ ఈ రకాలను సాగుకు వినియోగించాలి. ఫలితంగా 100 నుంచి 120 రోజుల్లోగా పంట చేతికి వస్తుంది. ఎకరాకు 3కిలోల విత్తనం సరిపోతుంది.

**ఎరువుల వాడకం**

ఎకరాకు 4 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు, యూరియా 40 కిలోలు, ఎస్ఎస్‌పీ (సూపర్) 110 కిలోలు, పొటాష్ 60 కిలోలు, సూపర్ మొత్తం 110 కిలోలు, పొటాష్ 60 కిలోలు, యూరియా 20 కిలోలు ఆఖరి దుక్కిలో వేయాలి. మిగతా 20 కిలోల యూరియాను పంట 40 నుంచి 45 రోజుల్లో పైపాటుగా వేసుకోవాలి. దుంప ఊరే సమయంలో 13:0:45ని 5గ్రాములు తీసుకుని, లీటరు నీటిలో కలిపి ఎకరాకు రెండు సార్లు పిచికారీ చేయాలి.

**కలుపు యాజమాన్యం**

విత్తనం వేసిన రెండు రోజుల్లో పెండి మిథాల ఒక లీటరును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. 25 రోజుల తర్వాత మెట్రిబుజిన్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

**నీటి తడులు**

8 నుంచి 15 రోజుల వ్యవధిలో నీరు పట్టాలి. డ్రిప్, ఎత్తయిన మడుల ద్వారా నీరందిస్తే నాణ్యత దుంపలతో పాటు అధిక దిగుబడి పొందవచ్చు.

**సస్యరక్షణ చర్యలు**

క్యారెట్ సాగులో సస్యరక్షణ చర్యలు చాలా తక్కువ. ఆకుమచ్చ నివారణకు మాంకోజెట్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

**పంట కోత**

దుంపలు ముదిరిన తర్వాత నారింజ రంగుకు మారుతాయి. దీంతో పొలానికి నీరుపెట్టి, మరుసటి రోజు ఆకులతో సహా దుంపలను తీసివేయాలి. కోత ఆలస్యం అయితే నాణ్యత తగ్గుతుంది. యాజమాన్య పద్ధతులను బట్టి ఎకరానికి 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుంది.

**మెలకువలు**

విత్తనాన్ని ఇసుకతో కలిపి నాటుకోవాలి. విత్తనం, ఇసుక 1:4 నిష్పత్తిలో కలిపి నాటితే మంచిది. నత్రజని మోతాదుకు మించి వాడకూడదు. మోతాదు మించితే, కోత ఆలస్యమై పగుళ్లు ఏర్పడతాయి. కాల్షియం లోపంతో దుంపపై నొక్కులు ఏర్పడి నల్లటి మచ్చలు వస్తాయి. దీని నివారణకు కాల్షియం నైట్రేట్ 5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పొలాన్ని సరిగ్గా దుక్కి చేయకపోయినా, సేంద్రియ ఎరువులు వాడకపోయినా దుంప నేలలోకి వెళ్లకుండా చీలిపోతుంది. కాబట్టి దుక్కి జాగ్రత్తగా చేయాలి.

# క్రీడలతో స్నేహ పూర్వక వాతావరణం

**డీఎస్పీ బాలకృష్ణారెడ్డి**

**తాండూరు రూరల్:** సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే పోలీస్, ప్రెస్‌కి మధ్య స్నేహ పూర్వక వాతావరణం నెలకొనేందుకు ఫ్రెండ్లీ క్రికెట్ నిర్వహించడం అభినందనీయమని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పెద్దేముల్ మండలం ఇందూర్ గ్రామంలో తాండూరు నియోజకవర్గ స్థాయి పోలీస్, ప్రెస్ క్రీడాకారుల మధ్య ఆదివారం క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. పని ఒత్తిడిలో ఉండే పోలీసులు, జర్నలిస్టులు సరదాగా క్రికెట్ ఆడటంతో వారికి మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. మొదటగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఆడిన పోలీస్ జట్టు 16 ఓవర్లలో 182 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రెస్ జట్టు 134 పరుగులు సాధించారు. 48 పరుగుల తేడాతో పోలీస్ జట్టు గెలుపొందింది. అనంతరం విజేతలకు డీఎస్పీ, సీనియర్ జర్నలిస్టులు కలిసి బహుమతులు ప్రదానం చేశారు. క్రికెట్ ఆడటానికి స్థలం ఇచ్చిన ఇందూర్ గ్రామ పెద్దలు, యువకులకు ప్రెస్, పోలీసులు కృతజ్ఞత తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ నగేశ్, ఎస్‌ఐలు శ్రీధర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, గిరి, శంకర్, సీనియర్ జర్నలిస్టులు భీంసేన్‌రావు, వేణుగోపాల్‌రెడ్డి, లింగేశ్, రాంచెందర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి తదితరులు

# ఆయిల్ పామ్ సాగు చేపట్టండి

- ఇకోపామ్ క్షేత్ర సహాయకుడు రమేశ్
- ఎన్కేపల్లిలో రైతులకు అవగాహన సదస్సు



ఎన్కేపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న రమేశ్

**మోమిన్‌పేట:** అయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఇకోపామ్ అయిల్ ఫ్యాట్ క్షేత్ర సహాయకుడు రమేశ్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో రైతులకు అయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు 90శాతం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ పరికరాలను అందిస్తుందన్నారు. సంవత్సరానికి ఎకరాకు రూ.4,200ల చొప్పున మూడు సంవత్సరాల వరకు మొక్కల ఎదుగుదలకు ఆర్థిక సహకారం చేస్తుందన్నారు. నాటిన మూడు సంవత్సరాల నుంచి కాపుకు వచ్చిననాటినుంచి 30సంవత్సరాలు వరకూ ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు. ఆయిల్ పామ్ ఎక్కువ దిగుబడికి సమృద్ధిగా నీటి లభ్యత ఉండాలని ఆయన పేర్కొన్నారు. నాటిన 7సంవత్సరాల నుంచి సగటున ఎకరాకు 10నుంచి 12టన్నుల వరకు దిగుబడి వస్తుందని ఆయన తెలిపారు. సమగ్రమైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ప్రభాకర్‌రెడ్డి, మల్లయ్య, చంద్రయ్య, రాంచంద్రారెడ్డి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన గ్రామ దేవత బోనాలు



బోనాలతో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

**మొక్కులు చెల్లించుకున్న భక్తులు**

**ధారూరు:** గ్రామ దేవత మైసమ్మ తల్లికి నిర్వహించిన బోనాల జాతర ఆదివారం ముగిసింది. ముందుగా గ్రామ దేవతకు అభిషేకాలు, హారతి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం గ్రామ దేవత మైసమ్మకు నిర్వహించిన పూజలో గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రతీ ఇంటి నుంచి మహిళలు బోనం ఎత్తుకుని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా గుడికి వెళ్లారు. బోనాల ఊరేగింపులో పోతురాజు, శివ సత్తుల విన్యాసాలు పలువురుని ఆకట్టుకున్నాయి.

### మైనింగ్ వద్ద పేలుడు పదార్థాలు స్వాధీనం

**ఆమనగల్లు:** కడ్తాల్ మండలం చల్లంపల్లి గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 82లో ఉన్న మైనింగ్ వద్ద అక్రమంగా నిలువ ఉంచిన 13 కట్టల పేలుడు పదార్థాలు (డిటోనేటర్స్) స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు చల్లంపల్లి సమీపంలోని మైనింగ్ వద్ద తనిఖీ చేయగా అక్కడ ఉన్న షెడ్డులోని బ్యాగులో పేలుడు పదార్థాలు గుర్తించినట్లు చెప్పారు. అక్కడే ఉన్న సూపర్‌వైజర్ శంకర్‌ను ప్రశ్నించగా తాను మూడేళ్లుగా సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నానని, మైనింగ్ వద్ద జై భవానీ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ నిర్వాహకుడు రాజేందర్ బ్లాస్టింగ్ పనులను నిర్వహిస్తాడని తెలిపాడు. రెండు రోజుల క్రితం డిటోనేటర్లు తీసుకువచ్చి ఇక్కడే ఉంచినట్లు చెప్పాడు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో డిటోనేటర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని, సూపర్‌వైజర్ శంకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. బ్లాస్టింగ్ నిర్వాహకుడు రాజేందర్, మైనింగ్ కంపెనీ యజమాని అశ్వనీ, కేర్‌టేకర్ శ్రీనివాస్‌పై కూడా కేసు నమోదు చేశామని.. వారు పరారీలో ఉన్నారని తెలిపారు.

### బేకరీలో తనిఖీలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న కలర్ డబ్బా

**ధారూరు:** మండల కేంద్రంలోని న్యూ బెంగళూర్ బేకరీలో ఆదివారం పోలీసులు తనిఖీలు చేశారు. గడువు దాటిన కలర్ డబ్బాలను గుర్తించారు. వీటిని కేక్‌ల తయారీలో వినియోగిస్తున్నట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. కలర్ డబ్బాలను సీజ్ చేసి బేకరీ నిర్వాహకుడు సచిన్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# కడుపు నొప్పి భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య



జితేందర్ (ఫైల్)

**అనంతగిరి:** కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన చిట్టంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మద్గుల్ చిట్టంపల్లికి చెందిన పరిగి జితేందర్ (35)వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రెండు సంవత్సరాలనుంచి జితేందర్ కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. సమీప ఆస్పత్రులకు చూపించిన ఫలితం లేదు. దీంతో ఆయన శనివారం రాత్రి ఇంటినుంచి పొలం వద్ద గేదెలు కొట్టం వద్ద నిద్రించేందుకు వెళ్లాడు. మధ్యరాత్రి ఏదో చప్పుడు వస్తుందని పక్క పొలం రైతు చూడగా అప్పటికే జితేందర్ తన పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఈ విషయాన్ని వెంటనే మృతుడి కుటుంబీకులకు సమాచారం చేరవేశాడు. అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు స్థానికుల సాయంతో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీంకుమార్ తెలిపారు.

# రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ



పోటీల్లో తలపడుతున్న స్వాములు

**కొందుర్గు:** హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ సింథటిక్ ప్రధాన అథ్లెటిక్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన 14వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో కొందుర్గు మండలం ముట్పూర్ ఉన్నత పాఠశాలకు చెందిన డాక్టర్ సోలపోగుల స్వాములు ప్రతిభ చాటారని ఎంఈఓ గాయత్రి దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షాట్‌పుట్, జావలిన్‌త్రోలో బంగారు పతకం, డిస్కస్ త్రోలో వెండి పతకం సాధించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు మార్చి 4 నుంచి 9వ తేదీ వరకు జాతీయ స్థాయి పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా స్వాములును పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

# అంతర్రాష్ట్ర గంజాయి పెడ్లర్ అరెస్ట్

**రూ. 15.50 లక్షల విలువైన గంజాయి స్వాధీనం**



వివరాలు వెల్లడిస్తున్న సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాశ్

**సైదాబాద్:** విలాసవంతమైన జీవితం కోసం గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర గంజాయి పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ. 15.5 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజు జాట్ అలియాస్ రాజు రామగుండంలో నివాసం ఉంటూ ఐస్‌క్రీం వ్యాపారం చేసేవాడు. విలాసవంతమైన జీవనానికి అలవాటు పడిన అతను సులువుగా డబ్బులు సంపాదించ,ఎందుకు గంజాయి విక్రయాన్ని ఎంచుకున్నాడు. ఒడిశాలోని చిత్రకుండకు చెందిన సుభాష్ వద్ద గంజాయి కొనుగోలు చేసి పలు ప్రాంతాలకు సరఫరా చేసేవాడు. ఇటీవల అతనికి మహారాష్ట్ర చంద్రపూర్‌కు చెందిన పాత కస్టమర్ పురుషోత్తం నుంచి 62 కేజీల గంజాయి ఆర్డర్ వచ్చింది. దీంతో రాజు ఈనెల 11న ఒడిశా వెళ్లి గంజాయి కొనుగోలు చేసి తిరిగి రామగుండం తిరిగి వచ్చాడు. మహారాష్ట్రకు వెళ్లేందుకు ప్రైవేట్ బస్సులో నగరానికి చేరుకున్నాడు. శనివారం సాయంత్రం నల్గొండ చౌరస్తా నుంచి కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, చాదర్‌ఘాట్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 62 కేజీల గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలోనూ పాల్వంచ, వైజాగ్‌లో ఇదేతరహా కేసులు ఉన్నట్లు డీసీపీ తెలిపారు. ఆయా కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చిన రాజు మళ్లీ గంజాయి దందా మొదలు పెట్టినట్లు తెలిపారు. అతడికి గంజాయి అమ్మిన సుభాష్, ఆర్డర్ చేసిన పురుషోత్తంలపై కూడా కేసులు నమోదు చేసామని ప్రస్తుతం వారు పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాసరావు నేతృత్వంలో అడిషనల్ డీసీపీ టి.స్వామి, మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు, చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాజు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి.సైదులు, ఎస్ఐలు సాయిరాం, షేక్ కవియుద్దీన్, ఎం.మధులు నిందితుడిని అరెస్ట్ చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# బీఆర్‌ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు

**డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

**చేవెళ్ల:** బీఆర్‌ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను పార్టీ మారుతున్నట్లు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతానని, పార్టీని వీడే ఆలోచన కానీ అవసరం కానీ లేదన్నారు. సబితమ్మ వెంటే ఉంటానని స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు. కేసీఆర్, కేటీఆర్, సబితారెడ్డి నాయకత్వంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజలు ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కావలి రవికుమార్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బి. నర్సింలు, నాయకులు మాధవ్‌రెడ్డి, రాంప్రసాద్, మల్లేశ్, నరేందర్‌రెడ్డి, తోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్‌సిటీ రహదారికి భూములివ్వం



లేమూరులో సమావేశమైన రైతులు

**కందుకూరు:** ఫ్యూచర్ సిటీ రహదారికి భూములు ఇచ్చేదిలేదని బాధిత రైతులు తీర్మానించారు. మండల పరిధిలోని లేమూరులో ఆదివారం ఫ్యూచర్ సిటీ రహదారిలో భూములు కోల్పోతున్న ఐదు గ్రామాల రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు డి.సుధాకర్, నారాయణ, ఢిల్లీ గణేశ్, స్వామి, కె.గణేశ్, కె.ఐలయ్య, ప్రశాంత్‌రెడ్డి, కె.రాజు తదితరులు మాట్లాడారు. ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలోకి వంద మీటర్ల మేర రహదారి నిర్మించడానికి తమ భూముల నుంచి సర్వే చేసి హద్దురాళ్లు పాతిందని తెలిపారు. తమకు అరకొర పరిహారం ఇవ్వడానికి చూస్తోందని, ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో తమ భూముల విలువ దాదాపు ఎకరం ధర రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు పలుకుతోందన్నారు. అంత డబ్బు ప్రభుత్వం ఇవ్వదని, అందుకోసం తమ భూములు ఇవ్వడానికి అంగీకరించేదిలేదన్నారు. కొత్తగా రహదారి నిర్మించే బదులు శ్రీశైలం రహదారిని తుక్కుగూడ నుంచి కొత్తూరు గేట్ వరకు గతంలో నిర్మించిన ఫార్మా రహదారిని కలిపేలా విస్తరించేలా ఆలోచించాలన్నారు. దీంతో రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. వీరికి సీపీఎం నాయకులు డి.రాంచందర్, బుట్టి బాల్‌రాజు తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రైతులు అనూరాధ, కృష్ణవేణి, రమేష్, తిరుపతయ్య, రాములు, వీరయ్య, జంగయ్య, నారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లకు మహర్దశ!

- పొలాలకు వెళ్లేందుకు దారుల నిర్మాణం
- ఉపాధి హామీ నిధులనుంచి పనులు
- తీరనున్న రైతుల కష్టాలు



పొలాలకు వెళ్లే రోడ్డు

**దౌల్తాబాద్:** రైతులు తమ పొలాలకు సులభంగా వెళ్లేందుకు మార్గం సుగమం కానుంది. మండలంలో అనేక చోట్ల చేలకు వెళ్లేందుకు సరైన దారుల్లేవు. పండిన పంటను తమ ఇళ్లకు తెచ్చుకునేందుకు నానా ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం రోడ్లను బాగు చేయించాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం ఉపాధి హామీ పథకం నిధులు వెచ్చించి మట్టి రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం సంకల్పించింది. దారులు బాగు చేస్తేనే వ్యవసాయంతో పాటు పంటను సులువుగా ఇంటికి, మార్కెట్‌కు తీసుకువచ్చే వీలు కలుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఇందుకోసం ప్రభుత్వం నిధులు ఖర్చు చేయనుంది.

**మండలంలో ఐదు రోడ్లు..**

మండలంలో ఉపాధి హామీ నిధుల నుంచి అల్లాపూర్, బిచ్చాల, ఎల్‌జీతండా, మాటూరు, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో పొలాలకు వెళ్లేందుకు రోడ్లను నిర్మించనున్నారు. ఇందుకుగాను రూ.43.52లక్షలు మంజూరయ్యాయి. 12నుంచి 15 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మించనున్నారు. దీనికి ఇరువైపులా మీటరు వెడల్పుతో తవ్వి రోడ్డు నిర్మాణం చేయనున్నారు. దీనికి సుమారు రూ.10లక్షలు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా ఈ పనులను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ చేపట్టనుంది. దీంతో రైతులు తమ పొలాలకు సులువుగా చేరుకుని పంటలను ఇంటికి, మార్కెట్‌కు తీసుకువచ్చే అవకాశం ఉంది.

**పనులు పూర్తి చేయిస్తున్నాం**

మండలంలో 5 గ్రామాల్లో రోడ్లు వేయడానికి ఉపాధిహామీ నుంచి నిధులు మంజూరయ్యాయి. వీటిని ఖర్చుచేసి మార్చి నెలాఖరు వరకు రోడ్డు పనులను పూర్తి చేయాలని చర్యలు చేపట్టాం. ఇప్పటికే రెండు గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన రోడ్లు కూడా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాము.

– రజనీకాంత్, ఏపీఓ, దౌల్తాబాద్